RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 13 సంచిక : 38 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం బుధవారం, 14 ఆగష్టు 2024 పేజీలు : 4 వెల : 2/-

# ఏటీఎం కార్డు లెక్క..




## తెలంగాణలో కొత్త రేషన్ కార్డు!

### ఈ-పాస్ మెషీన్‌లో స్వైప్ చేసి సరుకులు తీసుకొనేలా ఏర్పాట్లు - రేషన్‌కార్డులో ప్రత్యేక చిప్..స్వైప్ చేయగానే వివరాలన్నీ డిస్ ప్లే

### ప్రత్యేకంగా చర్చించిన కేబినెట్ సబ్ కమిటీ - హర్యానా, యూపీ, ఒడిశా విధానాలపై అధికారుల అధ్యయనం

హైదరాబాద్ : రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులకు సంబంధించి సర్కారు విప్లవాత్మక మార్పునకు నాంది పలకనున్నది. కొత్త రేషన్ కార్డుల జారీలో పాత పద్ధతికి స్వస్తి పలకాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఏటీఎం కార్డు తరహాలో కొత్త రేషన్ కార్డులు తీసుకురావాలని భావిస్తున్నది. ఈ పాస్ మెషీన్‌లో స్వైప్ చేసి రేషన్ తీసుకునేలా ఈ కార్డులను తీసుకురావాలని ఆలోచన చేస్తున్నది. ఏటీఎంలో కార్డు పెట్టి డబ్బులు తీసుకున్నంత ఈజీగా రేషన్ సరుకులు తీసుకునే వెసులుబాటు కల్పించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఇప్పటికే సివిల్ సప్లయ్స్ అధికారుల బృందం హర్యానా, ఉత్తరప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో అధ్యయనం చేసినట్టు సమాచారం. ఒక ఐడీ కార్డు పరిమాణంలో ఉండే స్వైపింగ్ కార్డులను రూపొందించి అందులో ఒక చిప్‌ను అమర్చాలని ప్రభుత్వం డిసైడ్ అయినట్టు సమాచారం. ఈ పాస్ మెషిన్‌లో స్వైప్ చేయగానే చిప్ యాక్టివేట్ అయ్యేలా కార్డును డిజైన్ చేయనున్నారు. యాక్టివేట్ అయిన చిప్‌లో రేషన్ కార్డు లబ్ధిదారుల వివరాలతో సహా పూర్తి సమాచారం స్వైపింగ్ మెషీన్? మానిటర్ పై డిస్ ప్లే అవుతుంది. ఈ విధానం అమల్లోకి వస్తే రేషన్ షాపుల్లో జరిగే మోసాలను అరికట్టడంతోపాటు డూప్లికేషన్ తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తున్నది.

**కొత్త కార్డుల జారీ దిశగా సర్కారు చర్యలు :** రాష్ట్రంలో గత దశాబ్ద కాలంగా కొత్త రేషన్ కార్డులు జారీ చేయకపోవడంతో లక్షలాది మంది ఎదురు చేస్తున్నారు. తాజాగా, రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు, హెల్త్?కార్డులు ఇవ్వాలని సర్కారు నిర్ణయం తీసుకున్నది. దీనిపై ఇటీవలే సివిల్ సప్లయ్స్ మంత్రి ఉత్తమ్ కుమార్ చైర్మన్ గా ముగ్గురు సభ్యులతో కేబినెట్ సబ్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇటీవలే ఈ కమిటీ తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రేషన్ కార్డు, హెల్త్ కార్డులకు అర్హతలు, విధివిధానాలు, వార్షిక ఆదాయ పరిమితిపైనే మంత్రివర్గ ఉప సంఘం ప్రధానంగా చర్చించింది. కొత్త కార్డుల జారీకి దరఖాస్తులు ఎప్పటి నుంచి స్వీకరించాలనే దానిపై త్వరలో విధివిధానాలను జారీ చేయనున్నారు.

**సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పర్ట్స్‌తో సబ్ కమిటీ చర్చలు...** గ్రెయిన్ ఏటీఎంల తరహాలో రేషన్ కార్డులు రూపొందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఏటీఎం కార్డుల తరహాలో ఉండే ఈ కార్డులకు ప్రత్యేకమైన మైక్రో చిప్?ను అనుసంధానం చేయనున్నారు. ఈ ప్రక్రియకు సంబంధించి సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పర్ట్స్‌తో కేబినెట్ సబ్ కమిటీ మాట్లాడింది. ఈ తరహా కార్డుల రూపకల్పన, జారీకి సంబంధించి సాధ్యాసాధ్యాలపై మంత్రి వర్గ ఉపసంఘం చర్చించింది. కొత్త రేషన్ కార్డులను ఏటీఎం కార్డుల తరహాలో తీసుకురావొచ్చని సాఫ్ట్‌వేర్ నిపుణులు కేబినెట్ సబ్‌కమిటీకి సూచించారు. ఈ నేపథ్యంలో ఈ రేషన్ కార్డులను వీలైనంత త్వరగా రేషన్?లబ్ధిదారులకు అందించేందుకు సర్కారు సన్నాహాలు చేస్తున్నది.

**ఇప్పటికే పలు రాష్ట్రాల్లో అమలు :** ఇప్పటికే పలు రాష్ట్రాల్లో డిజిటల్ రేషన్ కార్డులు వినియోగిస్తున్నారు. ప్రధానంగా హర్యానా రాష్ట్రంలో ఏటీఎం కార్డుల తరహాలో ఉండే డిజిటల్ రేషన్ కార్డ్స్ విధానం విజయవంతంగా అమలవుతున్నది. ఉత్తరప్రదేశ్‌లో బార్ కోడ్ తరహాలో రేషన్ కార్డుల విధానం అమల్లో ఉంది. ఒడిశాలో ఏటీఎం తరహాలో ఉండే రేషన్ కార్డులను అమలు చేయడానికి అక్కడి ప్రభుత్వం ప్లాన్ చేస్తున్నది. గ్రెయిన్ ఏటీఎంల పేరుతో ఒడిశాలో కొత్త రేషన్ కార్డులను అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం జరుగుతున్నది. రాష్ట్రంలోనూ ఇదే తరహాలో డిజిటల్ విధానంతో రేషన్ కార్డులను అమలు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది.

## సెప్టెంబరు రెండో వారంలోగా ఆర్ఆర్ఆర్ భూసేకరణ పూర్తి చేయాలి: సీఎస్

హైదరాబాద్: రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం సెప్టెంబరు రెండో వారంలోగా భూసేకరణ పూర్తి చేయాలని కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణ పురోగతిపై కలెక్టర్లతో సీఎస్ సమీక్ష నిర్వహించారు. ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. భూములు కోల్పోతున్న రైతులకు చట్టపరమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ల అధ్యక్షతన కమిటీలను ఏర్పాటు చేసి భూముల మార్కెట్ విలువ



ఆధారంగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టు కేసులపై ప్రత్యేక చొరవ తీసుకుని, త్వరగా పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు. రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక సీఎస్ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవిన్ మిత్తల్, అటవీ శాఖ అదనపు కార్యదర్శి ప్రశాంతి, ఆర్అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, సంయుక్త కార్యదర్శి హరీష్, రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, యాదాద్రి, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

## ఉద్యమకారుల కొట్లాట.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ వివాదం ఏ మలుపు తీసుకోనుంది?

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ కోసం ఉద్యమకారుల కొట్లాటకు ఫుల్‌స్టాప్ పడదా...? ఇప్పటికే ఒకసారి గవర్నర్ నిర్ణయంపై కోర్టుకు వెళ్లిన ఉద్యమకారుడు%ౌ% ప్రభుత్వం తనకు అనుకూలంగా నిర్ణయం రాకపోతే మరోసారి కోర్టుకు వెళ్లేందుకు సిద్ధపడుతున్నారా? ఈ పరిణామాలు చట్టసభలో అడుగుపెట్టాలనే ఉద్యమనేతకు చికాకు పుట్టిస్తున్నాయా? ఇంతకీ చట్టసభలో అడుగుపెట్టాలని తహతహలాడుతున్న ఆ ఇద్దరు ఉద్యమకారులు ఎవరు? ఈ యుద్ధంలో గెలిచేదెవరు?

**ప్రభుత్వానికి సవాల్‌గా మారిన పెద్దల సభకు సభ్యుల ఎంపిక..** తెలంగాణలో పెద్దల సభకు సభ్యుల ఎంపిక ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. ముఖ్యంగా గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ నియామకంపై కొంతకాలంగా కొనసాగుతున్న వివాదం ఎటువంటి మలుపు తీసుకుంటుందోననే చర్చ జరుగుతోంది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఉద్యమ నేత, టీజేఎస్ అధినేత ప్రొఫెసర్ కోదండరాం, సియాసిత్ ఎడిటర్ అమీర్ అలీఖాన్ పేర్లను ప్రభుత్వం సిఫార్సు చేసింది. ఐతే ఈ ఇద్దరి పేర్లను గతంలోనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గవర్నర్‌కు సిఫార్సు చేయగా, వెంటనే ఆమోదం లభించింది. ఐతే ఈ నియామకంపై ప్రతిపక్షానికి చెందిన ఉద్యమకారుడు దాసోజ్ శ్రవణ్ అభ్యంతరం చెబుతూ కోర్టుకు ఎక్కడంతో ఫుల్‌స్టాప్ పడింది. ఆ తర్వాత మరోసారి ప్రభుత్వ పరిశీలనకు కోర్టు ఆదేశించడంతో..... తాజాగా మళ్లీ కోదండరాం, అమీర్ అలీఖాన్ పేర్లనే సిఫార్సు చేసింది ప్రభుత్వం.

**రాజకీయ నేపథ్యం ఉందనే కారణంతో తిరస్కరించిన అప్పటి గవర్నర్ తమిళిసై..** గవర్నర్ కోటా కింద రాష్ట్ర ప్రభుత్వం సభ్యులను నామినేట్ చేసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో గవర్నర్ కోటాలో రెండు ఖాళీగా ఉన్నాయి. వీటికి గత ప్రభుత్వం దాసోజు శ్రావణ్, కుర్రా సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించింది. అయితే ఈ ఇద్దరికీ రాజకీయ నేపథ్యం ఉందనే కారణంతో అప్పటి గవర్నర్ తమిళిసై





ప్రభుత్వ నిర్ణయాన్ని ఆమోదించ లేదు. ఇద్దరి పేర్లను తిరస్కరించారు. ఈలోగా ఎన్నికలు రావడం బీఆర్ఎస్ సర్కార్ ఓడి.. కాంగ్రెస్ అధికారం చేపట్టడం చకచకా జరిగిపోయింది. ఇక ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీఖాన్ పేర్లను సిఫార్సు చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. దీనికి అప్పటి గవర్నర్ తమిళిసై ఆమోదం తెలిపారు.

**కోదండరాం పేరుకు ఎలా ఆమోదం తెలుపుతారని వాదన..** అయితే గవర్నర్ నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ హైకోర్టులో కేసు వేయడంతో ఎమ్మెల్సీ నియామక ప్రక్రియ పెండింగ్‌లో పడిపోయింది. తాము రాజకీయ నేపథ్యం ఉన్నవారమంటూ గవర్నర్ తమ నియామకాలను తిరస్కరించిందని%ౌ% ఇప్పుడు కోదండరాం పేరుకు ఎలా ఆమోదం తెలుపుతారన్నదే దాసోజు వాదన. ఏకంగా జనసమితి అనే పార్టీ అధ్యక్షుడిని గవర్నర్ కోటాలో నియమించడం ఎలా సరైందంటూ ప్రశ్నిస్తున్నారు శ్రవణ్.

**మళ్లీ కోర్టుకు వెళతానని దాసోజు శ్రవణ్ హెచ్చరిక..** ఇక గవర్నర్ కోటా ఎమ్మెల్సీ వ్యవహారం కోర్టుకెక్కడంతో 8 నెలలుగా పెండింగ్‌లో పడిపోయింది. దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ పిటిషన్లను విచారించిన హైకోర్టు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సిఫార్సులను అమలు చేయకుండా హోల్డ్‌లో పెట్టేసింది. కొత్తగా మళ్లీ నియామకాలను చేపట్టాలని ప్రభుత్వానికి సూచించింది హైకోర్టు. దీంతో ప్రొఫెసర్ కోదండరాం ఆశలపై నీళ్లు జల్లినట్లైంది. ఐతే ప్రభుత్వం తాజాగా కోదండరాం పేరును సిఫార్సు చేయడం, దీనిపై మళ్లీ కోర్టుకు వెళతానని దాసోజు శ్రవణ్ హెచ్చరిస్తుండటంతో ఈ పొలిటికల్ వార్ ఆసక్తికరంగా మారింది.

**గవర్నర్ వద్ద పెండింగ్..** గవర్నర్ మారడం.. ఇన్‌చార్జ్ గవర్నర్ కొంత కాలం ఉండటంతో ఎమ్మెల్సీ ఖాళీ స్థానాల భర్తీ అంశం ఇన్నాళ్లూ వాయిదా పడుతూ వచ్చింది. ప్రస్తుతం కొత్త గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బాధ్యతలు స్వీకరించడంతో మళ్లీ ఎమ్మెల్సీ నియామక ప్రక్రియ తెరపైకి వచ్చింది. లాస్ట్ క్యాబినేట్ సమావేశంలో ఖాళీ ఎమ్మెల్సీ స్థానాల భర్తీపై నిర్ణయం తీసుకున్నారు. మళ్లీ కోదండరాం, అమీర్ అలీఖాన్ పేర్లను క్యాబినెట్ లో తీర్మానించారు. ప్రస్తుతం ఈ అంశం గవర్నర్ వద్ద పెండింగ్ లో ఉంది.

**సహచర ఉద్యమకారుడికి అన్యాయం చేయొద్దంటూ కోదండరామ్‌కి లేఖ..** గవర్నర్ ఇంకా ఆమోదించకపోయినా, కోదండరాం, అమీర్ అలీఖాన్ పేర్లపై బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఇప్పటికీ మొండిపట్టుదలే ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికే కోదండరామ్‌కు లేఖ రాశారు. ఒక ఉద్యమ నేతగా.. సహచర ఉద్యమకారుడికి అన్యాయం చేయొద్దంటూ అభ్యర్థిస్తున్నారు దాసోజు. క్యాబినెట్ సిఫార్సును గవర్నర్ ఆమోదిస్తే.. మరోసారి న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానంటూ హెచ్చరిస్తున్నారు. పాత కేసు కూడా ఇంకా కంప్లీట్ కాలేదని... ప్రభుత్వం మాత్రం గవర్నర్ కోటా అంశానికి పాత పేర్లనే మళ్లీ పంపడంపై కోర్టులో సవాల్ చేస్తానంటున్నారు శ్రవణ్. దీంతో ఉద్యమకారులైన ప్రొఫెసర్ కోదండరాం, శ్రవణ్ మధ్య ఎమ్మెల్సీ వార్ కంటిన్యూ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు.




# బీఆర్ఎస్ టూ కాంగ్రెస్

# ఇక వలసల వరదే...!

## కాంగ్రెస్‌లోకి ఆరుగురు ఎమ్మెల్యేలు... లిస్టులో ఉంది ఎవరంటే..?

హైదరాబాద్ : బిఆర్ఎస్ ముఖ్య నాయకులు బిజెపితో టచ్లోకి వెళ్లారన్న వార్తలు నేపథ్యంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆపరేషన్ మరోసారి వదిలిపెట్టారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అరడజను మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్లో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్నారు. ఆయన హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన వెంటనే మరోసారి చేరికలు ఉంటాయని అంటున్నారు. వాస్తవానికి కొత్తగూడెం నుంచి గెలిచిన సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిపి 65 మంది ఎమ్మెల్యేల మద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కాలం నిలవదు అంటూ బీఆర్ఎస్ ముఖ్య నేతలు.. కేసీఆర్ ఎన్నోసార్లు ప్రకటనలు చేశారు. దీంతో రేవంత్ రెడ్డి వెంటనే ఆపరేషన్ ఆకర్షకు తెరలేపారు. ముందుగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తో మొదలుపెట్టి బి.ఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్లో చేరుతూ వస్తున్నారు. బిఆర్ఎస్ కు చెందిన 26 మంది ఎమ్మెల్యేలతో శాసనసభ పక్షాన్ని ఏర్పాటు చేయించి సీఎల్పీ లో విలీనం చేయించేందుకు రేవంత్ రెడ్డి ప్రణాళిక రచించారని ప్రచారం జరుగుతోంది. బడ్జెట్ సమావేశాలకు ముందే రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో సంప్రదింపులు జరుపుతారు. ఇక కాంగ్రెస్‌కు ప్రాథినిథ్యం లేని గ్రేటర్ హైదరాబాద్ చివరి నియోజకవర్గ ప్రధానంగా దృష్టి పెట్టారు. ఇప్పటికే శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ - రాజేందర్ నగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ - పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సీఎం సమక్షంలో కాంగ్రెస్లో చేరారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే పెట్టుబడులను ఆహ్వానించేందుకు రేవంత్ అమెరికా పర్యటనకు వెళ్ళిన సంగతి తెలిసిందే. అయితే బిజెపి పెద్దలతో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు సంప్రదింపులు జరుపుతున్నారు అని.. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే పెట్టుబడులను ఆహ్వానించేందుకు రేవంత్ అమెరికా పర్యటనకు వెళ్ళిన సంగతి తెలిసిందే. అక్కడ నుంచి రేవంత్ వచ్చిన వెంటనే ఈ ఆపరేషన్ ఆకర్షను ముమ్మరం చేస్తారంటున్నారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## వెంకయ్య వ్యాఖ్యల కలకలం.. చంద్రబాబు పాటిస్తారా మరి?

ఉపరాష్ట్రపతిగా పదవీ విరమణ చేశాక వెంకయ్య నాయుడు క్రియాశీలక రాజకీయాలకు దూరమయ్యారు. ప్రస్తుతం ఆయన తన చిన్ననాటి స్నేహితులను కలుస్తూ వస్తున్నారు. అలాగే తమ కుటుంబం ఏర్పాటు చేసిన స్వర్ణభారతి ట్రస్టు సేవలపై దృష్టి సారించారు. అలాగే వివిధ పాఠశాలలు, కళాశాలల వార్షికోత్సవాలకు హాజరవుతూ విద్యార్థులకు వివిధ అంశాలపై విలువైన సూచనలు చేస్తున్నారు. తాజాగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా దేశవ్యాప్తంగా ఉచిత పథకాలపై చర్చ జరుగుతున్న వేళ ఆయన వ్యాఖ్యలు హాట్ టాపిక్ గా మారాయి. ప్రజలకు వైద్యం, చదువు ఉచితంగా అందిస్తే సరిపోతుందని వెంకయ్య నాయుడు తెలిపారు. మిగతావి ఉచితంగా ఇవ్వాల్సిన అవసరం లేదని ఆయన తన అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజలకు ఉచితంగా పథకాలను ఇవ్వడానికి బదులు వారికి పనిలో శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వాలకు సూచించారు. తద్వారా ప్రజలకు వివిధ పనుల్లో ఉపాధి దొరుకుతుందన్నారు. వారి జీవితాలు కూడా బాగుపడతాయని చెప్పారు. అప్పుడే దేశం, రాష్ట్రాలు బాగుపడతాయని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం వైసీపీ.. కూటమి ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఇవ్వాల్సిందేనని వైసీపీ డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో ఉచిత పథకాలపై వెంకయ్య నాయుడు వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ఉచిత పథకాలపైనే కాకుండా వివిధ అంశాలపైన వెంకయ్య నాయుడు తన అభిప్రాయాలను వెలిబుచ్చారు. పోలీసు స్టేషన్లు, రెవెన్యూ కార్యాలయాలపై పెత్తనం చేయడం కాకుండా అభివృద్ధిపై నేతలు దృష్టి సారించాలని ఆయన సూచించారు. ప్రజా జీవితంలో బూతులు మాట్లాడవద్దని కోరారు. బూతులు మాట్లాడేవారికి మొన్నటి ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి తీర్పు ఇచ్చారో చూశామన్నారు. చట్ట సభల్లో మాట్లాడేటప్పుడు మంచి భాష మాట్లాడాలన్నారు. ప్రజా జీవితంలో ఎవరికి ఎవరు శత్రువులు కాదన్నారు. కేవలం ప్రత్యర్థులం మాత్రమేనన్నారు. సిద్ధాంతాలు, విలువలు, సంప్రదాయాలను గౌరవించాలని కోరారు. రాజ్యసభలో సైతం ఉపరాష్ట్రపతిని ధిక్కరించేలా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను చిన్నప్పటి నుంచి ఎన్నో ప్రతికూల పరిస్థితుల మధ్య పెరిగానని వెంకయ్య నాయుడు తెలిపారు. తన చిన్నప్పుడే తన తల్లి మరణించిందని.. తన జీవితంలో ఇదొక్కటే వెలితి అని చెప్పారు. ఇది తప్ప తనకు మరే అసంతృప్తి లేదని వివరించారు. తాను తన తల్లి ఆలోచనలకు అనుగుణంగా లా చదివానని చెప్పారు. అయితే ఎమర్జెన్సీ సమయంలో జైలుపాలు కావడంతో లా ప్రాక్టీస్ చేయలేకపోయానని తెలిపారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం.. వెంకయ్య నాయుడు వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకుంటుందా, లేదా అనే ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరుతో ఎన్నో హామీలను టీడీపీ ఇచ్చింది. అలాగే జనసేన పార్టీ సైతం కొన్ని హామీలను ఇచ్చింది. ఇప్పుడు ఈ రెండు పార్టీలు అధికారంలో ఉండటంతో ఉచిత పథకాల అమలు విషయంలో ఏం చేస్తారనేది ఆసక్తికరంగా మారింది.

# సుంకిశాల దారెటు?



హైదరాబాద్: నాగార్జునసాగర్ నుంచి హైదరాబాద్‌కు తాగునీటి తరలింపునకు ఉద్దేశించి చేపట్టిన సుంకిశాల ప్రాజెక్టు పనుల్లో జరిగిన మితిమీరిన జాప్యమే తాజాగా పంపుహౌస్ మునకకు కారణమని తెలుస్తోంది. ఈ పనులను దక్కించుకున్న మేఘా ఇంజినీరింగ్ సంస్థ 2016 జూన్‌లో జలమండలితో ఒప్పందం చేసుకుంది. ప్రాజెక్టు పనుల్లో భాగంగా పంప్‌హౌస్ నుంచి కోదండాపూర్ నీటి శుద్ధి కేంద్రాలకు 50 కిలోమీటర్ల వరకు 2325 ఎంఎం డయాతో రెండు వరుసలు పైపులైన్లు, సంపు, పంపుహౌస్ 3 టన్నెళ్లు, సూపర్‌స్ట్రక్చర్ నిర్మించాలి. గరిష్ఠంగా రెండేళ్లలో ఈ పనులన్నీ పూర్తి చేయాల్సి ఉంది. అయితే 8 ఏళ్లు దాటినా..70 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. పనులు ప్రారంభించిన తర్వాత ఈ స్థాయిలో ఎప్పుడూ సాగర్‌కు ప్రవాహం రాలేదు. దాదాపు ఏడు సీజన్లలో భారీ వరదలు రాకున్నా...పనులు పూర్తి చేయకపోవడం చూస్తే...అటు ఏజెన్సీ సంస్థ, ఇటు అధికార యంత్రాంగం నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆగస్టు వరకు సాగర్‌లోకి వరద రాదని ఏజెన్సీ నిర్వాహకులు ఎలా అంచనా వేశారో అర్థం కావడం లేదని జలమండలి అధికారులే అంటున్నారు.

**మళ్లీ పనులు ఎప్పుడో..**

పనులు రెండు నెలల్లో తిరిగి ప్రారంభిస్తామని అటు జలమండలి.. ఇటు ఏజెన్సీ ప్రకటిస్తున్నా సాంకేతికంగా అది సాధ్యమయ్యేలా కన్పించడం లేదు. నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 587.30 అడుగులకు చేరుకుంది. సెప్టెంబరు, అక్టోబరులోనూ కృష్ణాకు వరద ఉద్ధృతి పెరిగే అవకాశం ఉంది. ఆధునిక పద్ధతుల్లో సంపు నించి నీటిని తోడుదామన్నా..తొలుత సాగర్‌లో నీటి మట్టాలు కనిష్ఠానికి తగ్గాల్సి ఉంటుంది. అప్పుడే మరోసారి గేటు పెట్టి కూలిన రక్షణ గోడను నిర్మించాలి. వచ్చే వేసవి వరకూ పనులు ప్రారంభమయ్యే అవకాశమే లేదని నిపుణులు అంటున్నారు. కనీసం రెండు సీజన్లలో సాగర్‌లోకి పైనుంచి వరద రాకపోతేనే మట్టం 504 అడుగులకు తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. దాదాపు 40 అడుగుల మందం ఉన్న కాంక్రీట్ గోడలో ఒక ప్యానెల్ మొత్తం కూలిపోయింది. దీనికి అనుసంధానంగా పంప్‌హౌస్ చుట్టూ ఉన్న రక్షణ గోడల పటిష్ఠత ఎలా ఉందో పరిశీలించాల్సి ఉంటుంది. ఇవన్నీ పరిగణనలోకి తీసుకొని ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై తాజాగా జలమండలి కసరత్తు ముమ్మరం చేస్తోంది. శుక్రవారం ఎండీ అశోక్‌రెడ్డి, ఈడీ సత్యనారాయణ క్షేత్రస్థాయిలో ప్రాజెక్టును పరిశీలించి పనులు చేపడుతున్న ఏజెన్సీ ఇంజినీర్లు, ఇతర నిపుణులతో సమావేశమయ్యారు. క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంపై ఆరా తీస్తున్నారు. త్వరలో పూర్తిస్థాయిలో నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించనున్నారు.

# పరిశ్రమల దండు



యాదాద్రి : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని దండుమల్కాపురం గ్రామం పరిశ్రమలకు నిలయంగా మారింది. రాజధానికి సమీపంలో, హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారికి ఆనుకొని గ్రామం ఉండటంతో పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా ఉంది. ఈ గ్రామంలో 11,527.26 ఎకరాల భూమి ఉండి, అతి పెద్ద రెవెన్యూ గ్రామంగా మారింది. ప్రభుత్వ, అసైన్డ్ భూములు కూడా ఎక్కువగా ఈ గ్రామంలో ఉన్నాయి. దీని మూలంగా ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధికి ఈ గ్రామాన్ని ఎంపిక చేసుకొని పలు పరిశ్రమలను స్థాపించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యాక దేశంలోనే తొలిసారిగా నిర్మించే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక పార్కును ఈ గ్రామంలోనే ఏర్పాటు చేసింది. 2019 నవంబరు 1న ఈ పార్కును ప్రారంభించారు. 542 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించే ఈ పారిశ్రామిక పార్కులో మొత్తం 510 పరిశ్రమలను విడతల వారీగా నెలకొల్పనున్నారు. ఇప్పటికే దాదాపు 150 పరిశ్రమలు ఉత్పత్తులను ప్రారంభించాయి. ఉత్పత్తులను ప్రారంభించిన, నిర్మాణాలు ఉన్న పరిశ్రమల్లో కలిపి సుమారు పది వేల మంది వరకు కార్మికులు ఉపాధిని పొందుతున్నారు.

ఎక్కువగా ఫుడ్ ప్రాసెసింగ్, ఇంజినీరింగ్, ప్రింటింగ్, ప్యాకింగ్, ఫార్ములేషన్, టైల్స్, వ్యవసాయ వ్యర్థాలతో తయారు చేసే బ్రికెట్స్, కాలుష్యరహిత పరిశ్రమలు ఉన్నాయి. ఈ పార్కు పక్కనే చేనేత కార్మికులకు చేయూతనందించేందుకు ఉమ్మడి రాష్ట్రంలో టెక్స్‌టైల్ పార్కును నెలకొల్పారు. వీటిని ఆనుకొని రైస్‌హబ్, బొమ్మల పార్కులు నిర్మాణ దశలో ఉన్నాయి. జాతీయ రహదారికి అనుకొని రూ.2,800 కోట్లతో నిర్మిస్తున్న ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ లిమిటెడ్(ఐవోసీఎల్) టెర్మినల్ ప్రారంభానికి సిద్ధమైంది. రూ.1500 కోట్ల వ్యయంతో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బీపీసీఎల్) నిర్మాణ పనులు చకాచకా జరుగుతున్నాయి. ఇవి కాకుండా రసాయన పరిశ్రమలు, క్వారీ, క్రషర్ మిల్లులు కూడా ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలే కాకుండా ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఝార?ండ్, రాజస్థాన్, మహారాష్ట్ర, అసోం, ఒడిశా, బిహార్ తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఈ పరిశ్రమల్లో పని చేస్తుంటారు. ఇంకా ప్రభుత్వం ఈ గ్రామ పరిధిలో పలు కొత్త ప్రాజెక్టులు కూడా తీసుకొచ్చే అవకాశం ఉంది.

# అరకొర సేవలు.. రోగులకు అవస్థలు



పెద్దపల్లి: వర్షాకాలంలో కాలానుగుణ వ్యాధులు విజృంభిస్తున్నాయి. దోమల ఉద్ధృతి పెరగడంతో మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సేవలను విస్తరించేందుకు అధికారులు కార్యాచరణ చేపడుతున్నారు. వసతుల కల్పనతో పాటు అన్ని రకాల మందులను ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచుతున్నారు. కానీ వైద్యం చేయాల్సిన వైద్యులే విధులకు సరైన సమయంలో రాకపోవడంతో రోగులకు అవస్థలు తప్పడం లేదు.

**సమయానికి రాని వైద్యులు**

పెద్దపల్లి జిల్లా ప్రధాన ఆస్పత్రిలో ప్రతిరోజు 400 నుంచి 500 మంది ఓపీ(అవుట్ పేషంట్) రోగులు వస్తుంటారు. శుక్రవారం కూడా 410 మంది ఓపీ పేషంట్లు ఆస్పత్రికి వచ్చారు. కానీ వైద్యులు సకాలంలో రాకపోవడంతో గంటల తరబడి ఆస్పత్రిలోనే నిరీక్షించారు. జనరల్ ఫిజీషియన్, దంత, ఆర్థోపెడిక్ వైద్యులు రాకపోవడంతో ఆయా గదుల్లో రోగులు నిరీక్షించారు. కొందరు వైద్యులు ఉదయం 11 గంటలైనా విధులకు హాజరు కాలేదు. ఓపీ వైద్యులు ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు వారికి కేటాయించిన గదుల్లో అందుబాటులో ఉండాలి. ఓపీ చూయించుకున్న రోగులు అవసరమైన ఇతర పరీక్షలు చేయించుకొని, వాటి నివేదిక ఆధారంగా మందులు రాసిచ్చేంత వరకు ఓపీ ఛాంబర్‌లోనే వైద్యులు ఉండాలి. కానీ ఇది అమలు కావడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. జిల్లా ఆస్పత్రిలో 30 మంది వైద్యులుండగా 20 మంది విధులకు హాజరయ్యారు.

**మంథనిలో పెచ్చులూడుతున్నాయ్**

మంథని సామాజిక వైద్యశాలలో 210 మంది అవుట్ పేషెంట్లు వచ్చారు. ముగ్గురు వైద్యులు ఓపీ విధులు నిర్వహించారు. వచ్చిన రోగులను పరీక్షించారు. ఆస్పత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. కానీ ఆస్పత్రి శిథిల భవనంలో ఉండటంతో పైకప్పు పెచ్చులూడి పడుతుండటంతో రోగులు భయాందోళన చెందుతున్నారు. అదే విధంగా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేయక ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు.

**ప్రవర్తన మార్చేందుకు చర్యలు**

సమయపాలనపై వైద్యుల ప్రవర్తన మార్చేందుకు కఠిన చర్యలు చేపడతా. విధుల్లో నిర్లక్ష్యం చేసేవారిని గుర్తించి మందలించా. మంథని ఆస్పత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఇటీవలే మరో వైద్యుడికి సూపరింటెండెంట్ బాధ్యతలు అప్పగించాం. శ్రీధర్, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త

# శిక్షణ ఫలించె.. కొలువు సాధించె

కామారెడ్డి : టాస్క్ ఆధ్వర్యంలో కళాశాలల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఆయా ప్రాంగణ నియామకాల్లో పాల్గొనేలా చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 75కి పైగా కళాశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గత పదేళ్లలో 45వేల మంది వరకు తమ పేర్లను టాస్క్ వద్ద నమోదు చేసుకున్నారు. కళాశాలల్లో వివిధ సంస్థల భాగస్వామ్యంతో ప్రాంగణ నియామకాలు నిర్వహించగా.. అందులో 5వేలకు పైగా ఆయా సంస్థల్లో ఉద్యోగాలు సాధించారు. ఒక్కో ప్రాంగణ నియామకాల్లో వందలాది మందితో పోటీ పడి 10 నుంచి 30 మంది



ప్రతిభ చాటారు.

**భావవ్యక్తీకరణ.. శక్తి సామర్థ్యాలు..**

గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆంగ్లంలో వెనుకబడి ఉంటారనే వాదన ఉంది. ఫలితాల్లోనూ అంతగా రాణించలేకపోతున్నారు. కారణాలు ఏవైనా అనేక మంది పిల్లలకు సమకాలీన అంశాలపై పట్టు లేకుండా పోతోంది. అలాంటివారికి టాస్క్ ఆధ్వర్యంలో శిక్షణ అందిస్తున్నారు. ఉద్యోగ సాధనకు యువత చదువుతో పాటు ఇతర అంశాలపై దృష్టిసారిస్తున్నారు. సమకాలీన పరిస్థితులు అధ్యయనం చేసి వాటిపై అవగాహన పెంచుకుంటున్నారు. తమ భావవ్యక్తీకరణను మెరుగుపరుచుకుంటూ మౌఖిక పరీక్షల్లో ఎలా రాణించాలో తెలుసుకుని ఉద్యోగాలు సాధిస్తున్నారు.

**వేల సంఖ్యలో నియామకాలు**


శీనాథ్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా టాస్క్ ప్రతినిధి

డిగ్రీతోనే ఆయా సంస్థల్లో మెరుగైన ఉద్యోగాలు సాధించడమంటే ఆషామాషీ కాదు. దానికి కఠోర శ్రమ అవసరం. టాస్క్ ఆధ్వర్యంలో కళాశాలల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. వివిధ సంస్థల భాగస్వామ్యంతో ప్రాంగణ నియామకాలు నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు వేలాది మంది వివిధ సంస్థల్లో పని చేస్తున్నారు.

# ప్రజాకాంక్ష నెరవేరితే.. మరింత ప్రగతి!

కొత్తగూడెం: యువతకు ఉపాధి కల్పించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, పట్టణాలను తాకుతూ వెళ్లే జాతీయ రహదారులు, నూతన పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సహజ వనరులు, తెలంగాణ కొంగు బంగారమైన సింగరేణి సిరులు కొత్తగూడెం, పాల్వంచ పురపాలికల సొంతం. ఈ జంట పట్టణాలను మున్సిపల్ కార్పొరేషన్‌గా మార్చాలనే ప్రతిపాదన చర్చనీయాంశమవుతోంది. కార్పొరేషన్ ఏర్పాటుకు అర్హతలున్నాయని, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఇటీవల విన్నవించారు. ప్రభుత్వ పెద్దలు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. కార్పొరేషన్ ఏర్పాటుతో ఉభయ పట్టణాలు, సమీప మండలాల్లో అభివృద్ధి వేగవంతమవుతుందనే అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతోంది.

**పునర్వైభవం సాధించేలా..**నాలుగు దశాబ్దాలుగా కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలు పారిశ్రామిక ప్రాంతాలుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయి. 1980, 90 దశకాల్లోనే ఇక్కడ కార్పొరేట్ స్థాయిలో ఆసుపత్రులు, పాఠశాలలు అందుబాటులోకి వచ్చాయి. వ్యాపార, వాణిజ్య రంగాల్లోనూ జంట పట్టణాలు దూసుకెళ్లాయి. కొన్నేళ్లుగా అభివృద్ధి మందగించింది. అనేక పరిశ్రమలు మూతపడటం, సింగరేణి బొగ్గు గనులు తరిగిపోవటం.. కార్మికుల వలసలతో జంట పట్టణాలు తమ ప్రాభవాన్ని కోల్పోతున్నాయి. కొత్తగూడెం కేంద్రంగా జిల్లా ఏర్పడినా ప్రైవేటు రంగంలో పెట్టుబడులు రావట్లేదు. ఫలితంగా విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనలో జిల్లా వెనుకబడుతోంది. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు మున్సిపల్ కార్పొరేషన్‌గా మారితే అధునాతన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. తద్వారా పునర్వైభవాన్ని సాధించవచ్చు.



**అనుకూల.. ప్రతికూలాంశాలు**

ప్రస్తుతం కొత్తగూడెం మున్సిపాలిటీలోని 36 వార్డుల్లో సుమారు లక్ష మంది నివసిస్తున్నారు. పాల్వంచ మున్సిపాలిటీలోని 24 వార్డుల్లో సుమారు 1.20లక్షల మంది జనాభా ఉన్నారు. కొత్తగూడెం పట్టణానికి ఆనుకొని ఉన్న చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, పాల్వంచ మండలాల్లో చాలా గ్రామపంచాయతీలు దశాబ్దాల క్రితమే పట్టణ ప్రాంతాలుగా మారాయి. పాల్వంచతో పాటు చుట్టుపక్కల సెమీ అర్బన్ ప్రాంతాలను కలిపితే జనాభా 2.50 లక్షలకు పైగా ఉంటుంది. వ్యవసాయం కంటే ఇతర రంగాలపై ఆధారపడి జీవించేవారే ఎక్కువ. ఇలా సాంకేతికంగా కార్పొరేషన్ ఏర్పాటుకు అనుకూలతలున్నప్పటికీ, 1/70 యాక్ట్ అమల్లో ఉండే ఈప్రాంతాల్లో చట్టపరమైన చిక్కులను ఎలా అధిగమిస్తారనేది కీలకంగా మారనుంది.

**అధ్యయనానికి అనుమతులిస్తేనే..**

కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలను కార్పొరేషన్‌గా మార్చాలనే అంశం సీఎం దృష్టికి వెళ్లటంతో సాధ్యాసాధ్యాలు, లాభనష్టాలను మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో అధ్యయనం చేయాల్సి ఉంటుంది. అధ్యయనానికి ప్రత్యేక బృందాల నియామకం, క్షేత్రస్థాయి పరిశీలన ఎప్పుడు మొదలవుతుందోనని స్థానికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పారిశ్రామికంగా ఘనచరిత్ర కలిగి, జంట పట్టణాలుగా పేరొందిన కొత్తగూడెం, పాల్వంచ పురపాలికలను కలిపి కార్పొరేషన్‌గా మార్చాలి. ఇప్పటికే ఈ అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లాం. కార్పొరేషన్ ఏర్పాటుపై అధ్యయనానికి సర్కారు సత్వరం చర్యలు చేపట్టాలి. కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే

# సదర్మాట్ బ్యారేజ్ ప్రారంభోత్సవానికి సీఎం వస్తారు:ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్

### రైతుల పక్షపాతి కాంగ్రెస్

### చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందిస్తాం





**ఖానాపూర్ ఆగస్టు 13(ప్రభాత సమాచారం)**
రైతును రాజు చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళ వారం ఖానాపూర్ మండలంలోని సదర్మాట్ కెనాల్ నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. 13వేల ఎకరాలకు సదర్మాట్ కెనాల్ ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందు తోందని పేర్కొన్నారు. సదర్మాట్ బ్యారేజ్ పనులు సంపూర్ణంగా పూర్తి అయ్యాయని, త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. రైతుల ఎన్నో ఏళ్ళ కళ నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సాకారం అవుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కడెం ప్రాజెక్టుతో పాటు సదర్మాట్ కెనాల్ అభివృద్ధికి కొన్ని కోట్ల రూపాయలు మంజూరు చేసిందని తెలిపారు. 7 కిలోమీటర్ల కెనాల్ ఏర్పాటు కోసం నివేదికలు సిద్ధంగా ఉన్నాయని, త్వరలో ప్రభుత్వానికి నివేదికలు పంపి, కెనాల్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ ప్రాంత రైతులను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని అన్నారు. రైతుల గురించి అలోచించే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని పేర్కొన్నారు. వరంగల్ డిక్లరేషన్ లో ఏఐసీసీ మాజీ జాతీయ అధ్యక్షులు రాహుల్ రైతులకు ఏకకాలంలో 2లక్షల రూపాయలు మాఫీ చేస్తామని మాటి చ్చారని, ఇచ్చిన మాటను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. విడతల వారీగా రుణమాఫీ చేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోగుల ప్రాణాలతో చాలగటం ఆడొద్దు :వైద్యులను హెచ్చరించిన ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్

### నిర్లక్ష్యం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

### భోజనంలో నాణ్యత పాటించని కాంట్రాక్టర్ పై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే









**ఖానాపూర్ ఆగస్టు 13(ప్రభాత సమాచారం)**
రోగుల ప్రాణాలతో చాలగటం ఆడొద్దని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు వైద్యులను హెచ్చరించారు. మంగళవారం ఖానాపూర్ పట్టణ కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భ ంగా ఆసుపత్రిలోని వార్డులలో తిరుగుతూ రోగులను పరామర్శించి వారీ ఆరోగ్య పరిస్థితులపై అరా తీశారు. ఇటీవల రోగికి కాలం చెల్లిన గ్లూకోస్ పెట్టిన ఘటన దురదృష్టకరమన్నారు. భవిష్యత్తులో మళ్ళీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని వైద్యులకు సూచనలు చేశారు. రోగులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. భోజన విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని కాంట్రా క్టర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగుల ప్రాణాలతో చెలగాటమాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హేచ్చరించారు. అనంతరం ఆసుపత్రి లోని మందుల గదికి వెళ్లి మాత్రలను, గ్లోకోస్ లను పరిశీలించారు. కాలం చెల్లిన మందులను గ్లోకోస్, ఇంజక్షన్లను ఆసుపత్రిలో ఉ ంచుకోవద్దని, డాక్టర్లు ఎప్పటికప్పుడు మందులను పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. ఆసుపత్రిలో కోరత గల యంత్రాల పరికరాల నివేదికలను తమకు అందిస్తే, వాటిని త్వరలో మంజూరు చేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిధుల మంజూరు.. పనులిక జోరు



కామారెడ్డి : జిల్లాలోని సాగునీటి పథకాలను పూర్తిచేసేం దుకు ప్రభుత్వం నిధుల మంజూరుకు ఆమోదం తెలిపింది. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కాళేశ్వరం-22, నాగమడుగు ఎత్తిపోతల పథకాలను ప్రాధాన్య జాబితాలో చేర్చింది. దీంతో పాటు ఇప్పటికే పూర్తయిన ప్రాజెక్టుల వద్ద నిర్వహణ నిమిత్తం చేపట్టాల్సిన పనులకు నీటిపారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపగా ఆమోదం లభించింది.

**భూ సేకరణకు ఆదేశాలు**
కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలను సస్యశ్యామలం చేసేందుకు ఉద్దేశించిన ప్యాకేజీ- 22 పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఐదేళ్లుగా బిల్లులు మంజూరు కాక గుత్తేదారు పనులను తాత్కాలికంగా నిలిపారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్అలీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా నిధుల విడుదలకు అంగీకరించారు. సాగు నీటి పథకాల అభివృద్ధితో పాటు రూ. 20కోట్లు భూసేకరణకు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. మిగులు నిధులతో సదాశివనగర్‌లోని యాచారం వద్ద ఉన్న టన్నెల్(సొరంగం) తవ్వకం పనులు, భూంపల్లి రిజర్వాయర్ నిర్మాణం, కాలువల తవ్వకం జరపనున్నారు. మంజీరనదిలో నిర్మించే నాగమడుగు ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం ప్రాజెక్టుల ప్రాధాన్య జాబితాలో రెండో కేటగిరీలో చేర్చింది. ఇందుకు రూ. 53.26 కోట్ల నిధుల విడుదలకు ఆమోదం లభించింది.

**ఓఅండ్ఎం కింద..**
రాష్ట్రంలోని సాగునీటి పథకాల ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్(ఓఅండ్ఎం) కింద రూ. 280 కోట్లు కేటాయించింది. ఈ నిధులు సీఈల ప్రతిపాదనల మేరకు వినియోగించే వెసులుబాటు ఉంది. నిజాంసాగర్ జలాశయం కింద చేపట్టే కాలువల మరమ్మతుకు ఇటీవలే రూ. 14 లక్షల విడుదల చేశారు. పోచారం జలాశయం ఎగువన రహదారి నిర్మాణానికి రూ. 22 లక్షల నిధులు మంజూరు చేశారు.

# విద్యార్థులు క్రీడా రంగంలో జాతీయ స్థాయిలో రాణించాలి

### ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్









**ఖానాపూర్ ఆగస్టు 13(ప్రభాత సమాచారం)**
విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగంలో రాణిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్రం, జిల్లా పేరును మారుమ్రోగేలా అటలను ప్రదర్శించాలని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. మంగళవారం ఖానాపూర్ మండలం లోని మస్కాపూర్ గ్రామంలో గల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జిల్లాస్థాయి వెట్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. మనిషి ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని పేర్కొన్నారు. మనిషిని చదువు ఉన్న స్థాయిలో నిలబెడుతుందని, సమాజంలో గుర్తింపును తెస్తోందని పేర్కొన్నారు. వెట్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో రాణించాలని పాఠశాల, ఊరు పేరును అగ్రగామిగా నీలబెట్టాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు టీ షర్ట్ లను పంపిణీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సూది మందు రావట్లే..

ఆసిఫాబాద్ : రెండు కిడ్నీలు చెడిపోయిన వారి ఆరోగ్యం ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియని పరిస్థితి. వారానికి కనీసం రెండు మూడు సార్లు డయాలసిస్ (ఆరోగ్య స్థితిని బట్టి రక్తశుద్ధి) చేయించుకోవాలి. ఆ సమయంలో రక్తం పెరగడానికి ఇచ్చే సూది మందు (ఎరిత్రో పొయిటిన్ ఇంజిక్షన్) నెలరోజులకు పైగా కొరత ఉండడంతో.. బాధితులు ప్రైవేటులో కొనుగోలు చేసి ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. డయాలసిస్ రోగులకు ప్రభుత్వం ఆసరా పింఛను, బస్సు పాసులు అందిస్తుండగా.. చాలామందికి రావడం లేదు. ఇటు సూదిమందు కొరత, అటు పింఛన్ అందక బాధితులు నానాపాట్లు పడుతున్నారు.

జిల్లాలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రక్తశుద్ధి కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో సుమారు 76మంది చికిత్సలు పొందుతున్నారు. వీరే కాకుండా పేర్లు నమోదు చేసుకోని వారు మరో 15-20 మంది వరకు ఉంటారని అంచనా. వీరంతా వారానికి 2-3 సార్లు డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఒక్కోకేంద్రంలో అయిదేసి పడకలు ఉండగా, నిత్యం ఒక్కోచోట 4-5 విడతల్లో 15-20 మంది రోగులకు మాత్రమే రక్తశుద్ధి చేసే అవకాశం ఉంది. పడకలు, సిబ్బంది సంఖ్యను పెంచితే మరింత మంది చికిత్సకు అవకాశం ఉంటుంది. ఇక్కడ అవకాశం లేక కొందరు మంచిర్యాల, ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలివెళ్తున్నారు. ఇక్కడ ఉచిత చికిత్స పొందుతున్నా.. మందులు, ఇతర వాటికి నెలకు ఒక్కో రోగికి కనీసం రూ. 4-5 వేల వరకు ఖర్చు అవుతోంది. చాలామందికి పింఛన్ అందక సొంత డబ్బులతో మందులు కొనుగోలు చేస్తున్నారు. కొందరు పేదలు మాత్రం కొనుగోలకు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు.



**ప్రభుత్వం నుంచే సరఫరా నిలిచి..**
నెలలో పది డయాలిస్‌లు చేస్తే నాలుగు సార్లు రక్తం పెరిగే(ఈపీవో, ఎరిత్రో పొయిటిన్) సూది మందు ఇవ్వాలి. ఇది తీసుకున్నాక మరోసారి డయాలిసిస్ చేసే సమయంలో ఐరన్ ఇంజిక్షన్ ఇస్తారు. రెండు కేంద్రాలకు నెలకు పైగా ప్రభుత్వం నుంచి ఈ సూది మందులు రావడం లేదు. ఇవి తీసుకోకుంటే రోగిలో రక్తం పెరగక త్వరగా నీరసించే ప్రమాదం ఉంటుంది. ఈపీఓ సూదిమందు మార్కెట్‌లో రూ. 1150 నుంచి రూ. 1800 వరకు (ఒక్కో చోట ఒక్కో తీరు), ఐరన్ ఇంజిక్షన్ రూ. 200-250 వరకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం నుంచి వీటి సరఫరా నిలిచిపోవడంతో రోగులే బయట కొనాల్సి వస్తోంది. ఇప్పటికే నెలకు మందులతోపాటు ఈ ఖర్చులతో అదనపు భారం మోయాల్సి వస్తుందని వాపోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి ఈ సూది మందులను వెంటనే తెప్పించి రోగులకు మేలు చేయాలని కోరుతున్నారు.

**అధికారి వివరణ**
సూదిమందు కొరతపై ఆసుపత్రి పర్యవేక్షణాధికారి చెన్నకేశవులును చరవాణిలో సంప్రదించగా.. వీటి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వీటి కొరత ఉన్నట్లు చెప్పారు. చిత్రంలో కనిపిస్తున్నది కెరమెరి మండలం గోయగాంకు చెందిన విఠల్, సాంగ్వికి చెందిన కాశీనాథ్, వాంకిడి మండలం బెండారకు చెందిన భుజంగ్‌రావు.. వీరంతా కిడ్నీ వ్యాధిగ్రస్థులు. జిల్లా కేంద్రంలోని డయాలిసిస్ కేంద్రానికి చికిత్స నిమిత్తం వచ్చారు. వీరికి బస్సు పాసులు జారీ చేసినా, పింఛన్ రాలేదని చెబుతున్నారు. నెల రోజులకు పైగా ఇక్కడ రక్తం పెరిగే, ఐరన్ ఇంజిక్షన్లు లేక బయట మార్కెట్‌లో అధిక ధరలకు కొంటున్నట్లు వాపోతున్నారు. అధికారులు స్పందించి సూది మందులు తెప్పించి పింఛన్ మంజూరు చేయాలని కోరుతున్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గా టీ ప్రతాప్ సింగ్



**ఉట్నూర్ ఆగస్టు 13(ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గా టీ ప్రతాప్ సింగ్ నియమితులయ్యారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలిలలో భాగంగా ఉట్నూర్ కి టీ ప్రతాప్ సింగ్ ను ప్రిన్సిపాల్ గా నియమిస్తూ ఉన్నత విద్య శాఖ కమిషనర్ దేవసేన మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతాప్ సింగ్ ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ సీనియర్ అధ్యాపకుడిగా పని చేశారు. ప్రతాప్ సింగ్ కి ప్రిన్సిపాల్ గా నియమించడంపై కళాశాల అధ్యాపకులు, కళాశాల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# సతతం హరితం

కామారెడ్డి : అడవులు అంతరించిపోతున్న తరుణంలో లక్షలాది మొక్కలకు జీవం పోశారు. జిల్లాలో దాదాపు పదేళ్లలో అటవీ శాఖ ఆధ్వర్యంలో 87.44 కిలోమీటర్ల విస్తీర్ణంలో 87.50 లక్షల మొక్కలు నాటి పూర్వవైభవం తెచ్చారు. నాటిన మొక్కలు ఏపుగా ఎదిగి పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అంబారిపేట అటవీ బీట్ పరిధిలోని 135.95 హెక్టార్లలో సహజ సిద్ధ అడవులు అంతరించి కళావిహీనంగా కనిపించేది. ఇక్కడ లక్షలాది మొక్కలు నాటి పచ్చదనంగా మార్చారు. ఉమ్మడి దోమకొండ, మాచా రెడ్డి మండలాల్లోని పలు గ్రామాల పరిధిలో ఈ ప్రాంతం విస్తరించి ఉంటుంది. రామారెడ్డి మండలం ఖన్నాపూర్ బీట్, పిట్లం రేంజి పరిధిలోని బ్రాహ్మణపల్లి, మంగ్లూర్ బీట్, మంగ్లూర్, మాచారెడ్డి మండ లం చుక్కాపూర్‌లో లక్షలాది మొక్కలు నాటారు. మాచారెడ్డి, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, కామారెడ్డి మండలాల్లోని 50 హెక్టార్లలో మొక్కలు పెంచి సంరక్షించారు.

**రకరకాల వృక్షాలు** కంపా నిధులతో రకరకాల మొక్కలు నాటుతున్నారు. రావి, మర్రి, జువ్వి, మేడి, తాని, ఉసిరి, అల్లనేరేడు, సీతాఫలం, వెలగ, గుమ్మడి టేకు, తెల్లచిందుగ, నల్ల చిందుగ, పాలకొడిచ, నెమలినార, రేల, పెద్దమాను, గిరిషనమ్, సొప్పెర, నర్లింగ, పనస, మారేడు, చింత, తెల్లమద్ది, ఎగిస, జిట్రేగి, వేప, కానుగ, బట్టగానం, సీమచింత, వెదురు, సీమారుబా తదితర మొక్కలు నాటి పెంచుతున్నారు.

**వన్యప్రాణులకు జీవనాధారం** మొక్కల పెంపకం వన్యప్రాణులకు జీవనాధారంగా మారుతోంది. కోతులు, కొండెంగలు వంటి ప్రాణులు గ్రామాల్లోకి రావడం తగ్గుతా యి. అడవి పందులు, జింకలు, మనుబోతులు, దుప్పులు, కొండగొర్లు, కుందేళ్లు పంటలపై దాడి చేయకుండా ఉండేందుకు ఆస్కారం ఉంటుంది. వీటికి అటవీ ప్రాంతంలోనే సమృద్ధిగా ఆహారం లభించేలా ఏర్పాటు చేస్తున్నారు.






**ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ** : తెలంగాణ: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం 'హర్ ఘర్ తిరంగా-2024' ర్యాలీ నిర్వహించారు. భాజపా ఆధ్వర్యంలో జాతీయ జెండాలను చేత పట్టుకొని భారీగా వాహనాలపై ప్రదర్శన చేశారు. కరీంనగర్‌లో జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో ద్విచక్రవాహనాలపై ర్యాలీ నిర్వహించారు.

### భద్రత లేకుండా.. డ్యూటీ చేయం.. వైద్యుల నిరసనలతో

## దేశవ్యాప్తంగా ఓపీడీ సేవల్లో అంతరాయం

కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్-హాస్పిటల్‌లో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారం ఘటనకు నిరసనగా, హాస్పిటల్స్‌లో భద్రతపై సోమవారం దేశవ్యాప్త ఆందోళనలకు దిగిన వైద్యులు మంగళవారం కూడా కొనసాగిస్తున్నారు. హాస్పిటల్స్ వద్ద సరైన భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. 'నో సేఫ్టీ.. నో డ్యూటీ' అంటూ నినాదాలు చేస్తున్నారు. అత్యవసర సేవలు మినహా విధులకు తిరిగి హాజరయ్యేందుకు నిరాకరిస్తున్నారు.


దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్నారు. దీంతో పలు నగరాల్లో ఓపీ సేవలకు అంతరాయం ఏర్పడింది. కాగా ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఎంపిక చేసిన సేవలకు దూరంగా ఉంటామని సోమవారం ప్రకటించిన విషయం తెలిసిందే. కోల్‌కతాలో వైద్యురాలి హత్య చరిత్ర అత్యంత అవమానకరమైన ఘటన అని, వైద్యులకు తగిన భద్రత కల్పించాలంటూ కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డాకు అసోసియేషన్ ఒక లేఖ కూడా రాసింది. డ్యూటీలో ఉన్న మహిళా వైద్యురాలి హత్య ఘటనకు బాధ్యులైన అధికారులు అందరూ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. నిరసన తెలుపుతున్న వైద్యులపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని, ఈ కేసులో సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వాలని అని కూడా విజ్ఞప్తి చేసింది. కాగా వైద్యుల ఆందోళన తీవ్ర కోల్‌కతా నగరంలో ఎక్కువగా ఉంది. దీంతో నగరంలోని చాలా ఆసుపత్రులలో చికిత్స సేవలు దెబ్బతిన్నాయి. నిరసనల కారణంగా పలువురు రోగులు, వారి బంధువులు అసౌకర్యానికి గురవుతున్నామని చెబుతున్నాయి.

**ఉత్తరప్రదేశ్‌లో ఓపీడీ గది తలుపులు బద్దలు..** ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలోని కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్శిటీలో వైద్యులు నిరసనకు దిగడం ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. నిరసన తెలుపుతున్న వైద్యులు ఇవాళ ఉదయం గుమిగూడి సేవలను నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. అయితే చికిత్స అందించాలని రోగులు, వారి బంధువులు డిమాండ్ చేశారు. దీంతో అక్కడి ఒక్కసారిగా ఆందోళనకర వాతావరణం నెలకొంది. కొందరు రోగుల బంధువులు వైద్యం అందించాలని డిమాండ్ చేస్తూ మూసి ఉన్న ఓపీడీ గది తలుపులు బద్దలుకొట్టారు.

**అసలేం జరిగింది?** కోల్‌కతాలోని ప్రభుత్వం ఆస్పత్రి అయిన ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో డ్యూటీలో ఉన్న పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీ వైద్యురాలిపై గత గురువారం రాత్రి హత్యాచారం జరిగింది.

32 ఏళ్ల వైద్యురాలిపై దుండగులు ఈ దురాగతానికి పాల్పడ్డారు. పోస్ట్‌మార్టం ప్రాథమిక నివేదికలో బాధితురాలి కళ్లు, నోరు, ప్రైవేట్ భాగాల నుంచి రక్తస్రావం జరిగినట్టు గుర్తించారు. అంతేకాదు ఎడమ కాలు, మెడ, కుడి చేయి, ఉంగరపు వేలు, పెదవులపై కూడా గాయాలు అయినట్టు నిర్ధారణ అయ్యింది.

## సుంకిశాలను సందర్శించిన బీజేపీ ఎమ్మెల్యేల బృందం..



నల్గొండ: ఆగస్టు 2న సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిన ఘటన తెలంగాణ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై పెద్ద రాజకీయ దుమారమే రేగుతోంది. అయితే తాజాగా ఘటన జరిగిన సుంకిశాల ప్రాంతాన్ని బీజేపీ ఎమ్మెల్యేల బృందం పరిశీలించింది. ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పాల్వాయి హరీశ్ బాబు, రామారావు పటేల్, ఎమ్మెల్సీ ఎ.వి.ఎన్. రెడ్డి సహా స్థానిక బీజేపీ నాయకులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. సుంకిశాల ఘటన రాష్ట్ర ప్రజలందర్నీ విస్తుపోయేలా చేసిందని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటీ మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఆగస్టు 2న ప్రమాదం జరిగితే సోషల్ మీడియాలో వచ్చే వరకూ రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు గోప్యంగా ఉంచిందో చెప్పాలంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టర్ మేఘా కృష్ణారెడ్డిని కాపాడే ప్రయత్నం చేస్తోందా? అంటూ ప్రశ్నించారు. మొన్నదట రూ.1,500 కోట్ల అంచనా అంటూ ఇప్పుడు రూ.2,215కోట్లకు ఎందుకు పెంచారో చెప్పాలంటూ మహేశ్వర్ రెడ్డి వరస ప్రశ్నలు సంధించారు. ప్రాజెక్టు పూర్తికాక ముందే టన్నెల్ ఎందుకు ఓపెన్ చేయాల్సి వచ్చిందో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అనుమతి తీసుకోకుండానే కాంట్రాక్టర్ టన్నెల్ ఓపెన్ చేశారని అధికారులు చెప్తున్నారు. దీనిపై విచారణ చేశారా? ఘటనపై త్రిమెన్ కమిటీ వేశారు కదా మరి ఇంకా నివేదిక అందలేదా? అంటూ ప్రశ్నించారు. పంప్ హౌస్‌లో నాసిరకం పనులు చేశారని, మేఘా కంపెనీపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. సుంకిశాల ఘటనలో కాంట్రాక్టర్ తప్పు స్పష్టంగా కనిపిస్తోందని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. మేఘా కృష్ణారెడ్డి లైసెన్స్ రద్దు చేయాలని, ఆ కంపెనీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది అతి చిన్న ప్రమాదం అని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అంటున్నారు. రూ.2వేల కోట్ల ప్రజా ధనం చిన్న విషయమా అంటూ ఆయన తీవ్రంగా స్పందించారు. ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు గోప్యత పాటిస్తోందో చెప్పాలని ఎమ్మెల్యే హరీశ్ డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగి సోషల్ మీడియాలో వైరల్ అయిన తర్వాత గాని ప్రభుత్వం బయటపెట్టలేదంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఎవరూ చనిపోలేదని అధికారులు చెప్తున్నారని, కానీ ఆ అంశంలో తమకు అనుమానాలు ఉన్నాయని ఆయన అన్నారు. దీనిపై ప్రభుత్వం సీబీఐ విచారణ కోరాలని హరీశ్ డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మేఘా సంస్థపై అనేక ఆరోపణలు చేశారని, మరిప్పుడు వారికెలా పనులు కట్టబెట్టారని ఎమ్మెల్యే హరీశ్ ప్రశ్నించారు.

## స్వచ్ఛదనంపై మరింత శ్రద్ధ పెరగాలి



హైదరాబాద్ : స్వచ్ఛదనంపై మరింత శ్రద్ధ పెరగాలని మంత్రి సీతక్క సూచించారు. 'స్వచ్ఛదనం - పచ్చదనం' కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికీ అభినందనలు తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం, స్వయం సహాయక సంఘాల బలోపేతంపై జిల్లా పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో మంగళవారం నాడు రాష్ట్ర సచివాలయం నుంచి మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా స్థాయి అధికారుల నుంచి పారిశుధ్య కార్మికుల వరకు బాగా కష్టపడ్డారని తెలిపారు. మంచి పనితీరు కనబరిచిన సిబ్బందిని ఆగస్టు 15వ తేదీన సన్మానిస్తామని చెప్పారు. గతంలో పోలిస్తే ఎక్కువ పని జరిగిందని.. కానీ మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క తెలిపారు. మండలాల వారిగా రివ్యూలు చేసి సమగ్ర నివేదికలు ఇవ్వాలని సూచించారు. ఇక నుంచి ప్రతి నెలా మూడు రోజుల పాటు 'స్వచ్ఛదనం - పచ్చదనం' డ్రైవ్ కొనసాగుతుందని చెప్పారు. పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని చెప్పారు. పారిశుధ్య లోపాలపై వార్తలు వస్తే సరిదిద్దాలని అన్నారు. తప్పుడు వార్తలు వస్తే అధికారులు వాస్తవాలు ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఉద్దేశ పూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు తీసుకోవాలని అన్నారు. సర్పంచ్ ఎన్నికల వరకు అధికారులు ప్రజలకు మరింత అందుబాటులో ఉండాలని అన్నారు. జీపీ స్పెషల్ అధికారులు ఉదయం కనీసం మూడు గంటల పాటు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రతి రోజు సిబ్బంది అంటెండెన్స్‌తో పాటు వారు చేసిన పనుల వివరాలను తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మరో జత యూనిఫాంలు సిద్ధం చేసి పంపిణీ చేయాలని అన్నారు. మహిళా సంఘాల సభ్యత్వాన్ని కోటి మందికి చేర్చాలని అన్నారు. మహిళా శక్తి ప్రోగ్రాంలో ఎస్సీ, ఎస్టీ మహిళల భాగస్వామ్యం పెంచాలని సూచించారు. అధికారులు ఆవాస గ్రామాల్లో పర్యటించి మహిళా శక్తిలో చేర్పించాలని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చికున్ గున్యా వంటి విష జ్వరాలతో ఊర్లకు ఊర్లు మంచాన పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవని జ్వర సర్వేలు చేసి జ్వర నివారణకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. అయినా తప్పుడు వార్తలు రాస్తూ బద్నాం చేస్తున్నారని మండిపడ్డారు. తప్పుడు ప్రచారం చేస్తే అధికారుల వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. లేకపోతే ప్రభుత్వ పనితరం సరిగా లేదనే సంకేతాలు వెళ్తాయని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## హరీష్ రావు కామెంట్స్.. కంటతడి పెట్టుకున్న మంత్రి తుమ్మల..




ఖమ్మం, ఆగస్టు 13: సీతారామ ప్రాజెక్టు విషయంలో మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలపై మంత్రి తుమ్మల ఆవేదన వ్యక్తం చేశారు. ఒకానొక దశలో కంటతడి పెట్టుకున్నారు. ప్రచారం కోసం బటన్‌లు నొక్కే వ్యక్తిని తాను కాదని స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంత్రిగా ఎన్నో ప్రాజెక్టుల నిర్మాణంలో పాల్గొన్నానని అన్నారు. మంగళవారం నాడు ఖమ్మం క్యాంప్ కార్యాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టు విషయంలో హరీష్ రావు చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. వాస్తవాలను ప్రజలకు చెప్పాలనే ఈ ప్రెస్‌మీట్ పెట్టినట్లు మంత్రి తుమ్మల అన్నారు. తన నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో తన ఆవేదనను చెప్పదలచుకున్నానని అన్నారు. 'భద్రాద్రి శ్రీ రామచంద్రుని దయవల్ల.. ఎన్టీఆర్ ఆశీర్వాదంతో వేల టీఎంసీల నీరు వృథాగా సముద్రం పాలవుతుంటే.. గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్య శ్యామలం చేయాలనేది నా సంకల్పం. నాడు ఉమ్మడి రాష్ట్రంలో బడ్జెట్ ఇబ్బందులు వల్ల దుమ్ముగూడెం కాకుండా దేవాదుల ప్రాజెక్టు చేపట్టాం. వైఎస్ రాజశేఖర్ రెడ్డికి నాడే విజ్ఞప్తి చేశాను. పోలవరం బ్యాక్ వాటర్ ఆధారంగా దుమ్ముగూడెం ఇందిరా సాగర్ రాజీవ్ సాగర్ ప్రాజెక్ట్ చేపట్టాలని కోరాను. వైఎస్ అకాల మరణం తరువాత ఇందిరా సాగర్ రాజీవ్ సాగర్ పూర్తవ్వలేదు.' 'తెలంగాణ ఉద్యమ ఫలితంగా టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. ప్రాజెక్ట్ కోసమే కేసీఆర్ పిలుపు మేరకు టీఆర్ఎస్‌లో చేరాను. కేసీఆర్ రెండవ సారి అధికారంలోకి వచ్చాక కేవలం పంప్ హౌస్‌లు మాత్రమే నిర్మాణం చేశారు. రోళ్ళపాడు బయ్యారం అలైన్‌మెంట్ మార్చారు. బీజీ కొత్తూరు, పూసు గూడెం, కమలాపురం పంప్ హౌస్‌లు పూర్తి చేయడానికి వాగులు వంకలు వద్ద బ్రిడ్జి నిర్మాణాలు చేయలేదు. రాహుల్ గాంధీ పిలుపు మేరకు కాంగ్రెస్‌లో చేరాను. సీఎం రేవంత్ భద్రాచలం పర్యటనలో సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయడానికి ప్రతిపాదన చేశాను. జూలూరు పాడు టన్నెల్ పనులు మొదలవ్వ లేదు. యాతాల కుంట టన్నెల్ పూర్తి చేయలేదు కాబట్టి వైరా లింక్ కెనాల్ నిర్మాణం చేపట్టాం. డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ లేకుండా పంప్ హౌస్‌లు నిరర్థకంగా మారకుండా వైరా లింక్ కెనాల్ నిర్మాణం చేపట్టాం. కృష్ణా జలాలు సకాలంలో రాకపోయినా వైరా లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలతో వానాకాలం సాగు నీరు అందుతుంది. వైరా లింక్ కెనాల్ రెండు నెలల కాలంలోనే 16 స్ట్రక్చర్ లు నిర్మాణం అయింది.' 'టన్నెల్స్ నిర్మాణం పూర్తి అయ్యే వరకు పంప్ హౌస్ మోటార్లు పాడయ్యే అవకాశం ఉంది. దాంతో రూ. 8 వేల కోట్లతో చేసిన పనులు నష్టపోకుండా ట్రయల్ రన్ నిర్వహించాం. వైరా లింక్ కెనాల్ మధ్యలో గుజరాత్ గ్యాస్ పైప్ లైన్ వద్ద నిర్మాణాలకు వేగవంతంగా అనుమతులు తెచ్చాం. జూలూరుపాడు టన్నెల్ పూర్తి చేస్తేనే పాలేరు రిజర్వాయర్‌కు గోదావరి నీళ్ళు వస్తాయి. భగవంతుడు ఇచ్చిన అవకాశంతో వెంసూరుకు తమ్మిలేరుకు, ఎన్టీఆర్ కెనాల్‌తో సాగునీళ్లు అందిస్తున్నారు. అత్యంత కరువు పీడిత ప్రాంతాల్లో 32 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లు నేనే చేశాను. పాలేరు కరువుకు శాశ్వత పరిష్కారంగా భక్త రామదాసు లిఫ్ట్ ప్రాజెక్ట్ నిర్మాణం చేశా. నేను నిర్మాణం చేసిన సాగు నీటి ప్రాజెక్టులపై రైతాంగం సంతోషంగా ఉన్నారు.' అని మంత్రి చెప్పుకొచ్చారు.

**హరీష్ వ్యాఖ్యలు బాధ పెట్టాయి..** మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యలు తనను బాధ పెట్టాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తాను ప్రచారం కోసం బటన్ నొక్కే పనులు చేయలేదన్నారు. తాను ప్రేక్షకుడిగా మాత్రమే నిలబడ్డానని అన్నారు. తాను క్రెడిట్ కోసం పాకులాడే మనిషిని కాదన్నారు. తనకు ఎకరం పొలం కూడా ఈ ప్రాజెక్టు కింద లేదని మంత్రి తుమ్మల చెప్పుకొచ్చారు.

## సీఎం రేవంత్ సభను విజయవంతం చేయాలి : మంత్రి తుమ్మల

ఖమ్మం, ఆగస్టు 13: ఖమ్మం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి వైరా బహిరంగ సభ సన్నాహక సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ... గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం చేయాలనే సీతారామ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశామన్నారు. గత ప్రభుత్వం 8 వేల కోట్లతో నిర్మించిన సీతారామ ప్రాజెక్ట్ పంప్ హౌస్ మోటార్లు పాడవకుండా సద్వినియోగం కోసం తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఆగస్ట్ 15న వైరాలో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ విజయవంతం చేయాలన్నారు. రైతాంగం తలరాత మార్చే సభగా వైరా సభ నిలవనుందని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో ఖమ్మం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. "నా జీవిత కోరిక సీతారామతో తీరింది" అని అన్నారు. దక్షిణ అయోధ్యకు రైల్వేలైన్ రాబోతుందని.. త్వరలో కొత్తగూడెం విమానాశ్రయం రాబోతుందని వెల్లడించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి చేస్తామన్నారు. కాంగ్రెస్ పాలనలోనే భద్రాచలం అభివృద్ధి పూర్తి స్థాయిలో చేస్తామన్నారు. రాజకీయ అసూయతో చేసే విమర్శలను తాను పట్టించుకోనని స్పష్టం చేశారు. రాజకీయ వేధింపులు అరాచకం తన జీవితంలో లేవన్నారు. రాజకీయ విరోధులైన జలగం వెంగళరావు, రజబ్ అలీ ఇతర నేతలను వ్యక్తిగతంగా విమర్శ చేయలేదన్నారు. తాను చేసిన అభివృద్ధి పనులు పార్టీలకతీతంగా స్వాగతిస్తున్నారన్నారు. పదవులు శాశ్వతం కాదని... చేసిన పనులే చరిత్రలో నిలుస్తాయన్నారు. ప్రజల కోసం పనిచేసే నాయకులు ఏ పార్టీలో ఉన్నా అభిమానిస్తాం తప్ప వ్యక్తిగత విమర్శలు చేయనని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

## హాస్టళ్ల బాటపట్టిన అధికార యంత్రాంగం

హైదరాబాద్: రాష్ట్రంలో గురుకులాల పనితీరు, పరిశుభ్రతపై పార్టీ ఆధ్వర్యంలో కమిటీ వేస్తామన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటనతో ప్రభుత్వంలో చలనం వచ్చింది. ప్రభుత్వ యంత్రంగం ప్రభుత్వ హాస్టళ్ల బాటపట్టింది. జగిత్యాల జిల్లా పెద్దాపూర్ గురుకుల హాస్టల్‌కు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ వెళ్లనున్నారు. ఇక మంగళవారం తెల్లవారుజాము నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ హాస్టళ్లలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. వసతి గృహాల పనితీరు, సౌకర్యాలపై ఆరాతీస్తున్నారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సోమవారం జగిత్యాల జిల్లా పెద్దాపూర్ గురుకులంలో పాముకాటుతో చనిపోయిన ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌కు చెందిన అనిరుధ్ కుటుంబ సభ్యులను కేటీఆర్ పరామర్శించిన విషయం తెలిసిందే. అనిరుధ్‌లాంటి పరిస్థితి ఏతల్లిదండ్రులకూ రాకూడదని ఆవేదన వ్యక్తంచేశారు. ఎనిమిదినెలల్లో రాష్ట్రంలోని గురుకులాల్లో 36 మంది విద్యార్థులు చనిపోయారని, వారి కుటుంబాల్లో ఒక్కొక్కరికి ఉద్యోగాలిచ్చి ఆదుకోవాలని, ఈ విషయంలో ప్రభుత్వం రాజకీయ భేషజాలకు పోవద్దని సూచించారు. రాష్ట్రంలోని గురుకులాల పనితీరు, పరిశుభ్రతపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అనుభవం ఉన్న నాయకుడు, గతంలో గురుకులాల సెక్రటరీగా పనిచేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో కమిటీ వేసి ప్రభుత్వానికి నిష్పక్షపాతంగా సూచనలతో నివేదిక సమర్పిస్తామని చెప్పారు. నాలుగైదు రోజుల్లో కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి 20 సంక్షేమ గురుకులాలను పరిశీలిస్తుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు చనిపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎనిమిదినెలల్లో గరుకులాల్లో కలుషిత ఆహారం తిని 500 మంది వరకు దవాఖానల్లో చేరినట్టు తెలిపారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660